

మిథిలానగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మిథిలానగర్‌లో ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు

● మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని మిథిలానగర్‌కాలనీలో ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆమె కాలనీలో పర్యటించి బాధితులతో మాట్లాడారు. ముంపు సమస్యకు గల కారణాలను పరిశీలించారు. ఎస్ఎన్‌డీపీ, మునిసిపల్ అధికారులతో ఆమె ఫోన్‌లో మాట్లాడి.. కాలనీలోని ఓ రోడ్డు మీదుగా ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణం, మరో రోడ్డు మీదుగా వరదనీటి కాలువ నిర్మాణం చేపట్టాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని పనులు చేపట్టాలని, భవిష్యత్‌లో కాలనీకి ముంపు సమస్య తలెత్తకుండా అన్ని చర్యలూ తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం కాలనీలో ఉన్న వరదనీరు దిగవకు వెళ్లేలా తాత్కాలిక చర్యలు చేపట్టాలని, బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందజేయాలని ఆమె సూచించారు.



క్రిస్టియన్ కాలనీలో పాదయాత్ర నిర్వహిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

భూగర్భ డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

వనస్థలిపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం కార్పొరేటర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో పాదయాత్ర నిర్వహించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని పలు కాలనీల్లో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులు వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ విగ్నేశ్వరీ, వాటర్‌వర్క్స్ డీజీఎం రాజ్‌గోపాల్‌రెడ్డి, భవ్య, క్రిస్టియన్‌కాలనీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



కమర్షియల్ ట్యాక్సు కాలనీలో ఖాళీ స్థలంలో పారుతున్న మురుగునీటిని కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డికి చూపిస్తున్న కాలనీవాసులు

మురుగునీటి సమస్యను పరిష్కరించండి

హయత్‌నగర్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని కమర్షియల్ ట్యాక్సు కాలనీలో జలమండలి మేనేజర్ రాజుతో కలిసి స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనీలో పారుతున్న మురుగునీటిని వారికి చూపించారు. కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేక పోవడం వల్ల మురుగునీరు రోడ్ల వెంట పారుతుందన్నారు. దీని వల్ల తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. సాయంత్రం అయిందంటే కంపువాసనతో భోజనం కూడా చేయలేకపోతున్నామని తెలిపారు. అనంతరం కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా కమర్షియల్ ట్యాక్సుకాలనీకి డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

ప్రతీ సమస్య పరిష్కారమే ధ్యేయం: కేఎన్ఆర్

మన్సూరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో నెలకొన్న ప్రతీ సమస్యను పరిష్కరించడమే తన ధ్యేయమని స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మార్నింగ్‌వాక్‌లో భాగంగా సోమవారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ నాలాలో సిల్ట్ పేరుకుపోయినందున సరస్వతీనగర్‌కాలనీలో మురుగు సమస్య నెలకొందని, ఈ సమస్యను పరిష్కరించి సీసీరోడ్డు ఏర్పాటుకు, అదేవిధంగా చింతలకుంటదర్గా నుంచి పెద్దచెరువు ప్రధాన గేటు వరకు రోడ్డు విస్తరణకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి, కాలనీల సభ్యులు శేఖర్‌రెడ్డి, వేమారెడ్డి, జంకిలాల్, దయాకర్‌రెడ్డి, శంకర్, నరేష్, శ్రీనివాస్, నాయకులు నాంపల్లి రామేశ్వర్ పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

వనస్థలిపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ లచ్చిరెడ్డి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



యోగా షెడ్డులో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు, శ్రీధర్‌గౌడ్ తదితరులు

యోగాను జీవితంలో భాగంగా స్వీకరించాలి

వనస్థలిపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): యోగాను జీవితంలో భాగంగా స్వీకరించాలని హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు అన్నారు. వనస్థలిపురం డివిజన్ ప్రశాంత్‌నగర్ యూత్ అసోసియేషన్ గ్రౌండ్‌లో అధ్యక్షుడు నేలపాటి రామారావు ఆధ్వర్యంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో మంజూరైన 22లక్షల నిధులతో యోగా షెడ్డు, బోర్‌వెల్ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బోర్‌వెల్, యోగా షెడ్డు నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. యూత్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లగ్గొని శ్రీధర్‌గౌడ్, కాలనీ అధ్యక్షులు బాలాజీ, కర్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి, పక్కన వైద్యాధికారి డాక్టర్ తరుణ్, ప్రధానోపాధ్యాయురాలు కనకవల్లి తదితరులు



విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు వేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి



విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్న జైపురికాలనీ ఎంపీపీ పాఠశాల హెచ్ఎం బత్తుల శ్రీనివాస్‌రెడ్డి



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న వైద్య సిబ్బంది

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రభుత్వ స్కూల్, అంగన్‌వాడీ సెంటర్లు, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అబ్దుల్లాపూర్‌మెట్ వైద్యాధికారి ప్రసన్నలక్ష్మి హాజరై విద్యార్థులకు మాత్రలను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ మాత్రలను వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో పాటు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బీఎన్‌రెడ్డినగర్‌లో..

వనస్థలిపురం: నులిపురుగుల వ్యాధి నివారణ మందులను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సోమవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ టీచర్స్‌కాలనీ ఫేజ్-2లోని మండల పరిషత్ పాఠశాలలో జాతీయ నులిపురుగుల వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చిన్నారుల్లో నులిపురుగులను నివారించడానికి రక్తహీనతను తగ్గించడానికి తప్పనిసరిగా నులిపురుగుల మందులను వేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భరద్వాజ్, ఏఎన్ఎం శశికళ, అఖిల, శివరంజని, రాణి, సంతోష పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న బ్రిజున్నీసా

జైపురికాలనీలో..

మన్సూరాబాద్ : నాగోల్ డివిజన్ జైపురికాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం నులిపురుగుల వ్యాధి నివారణ మాత్రలను అందజేశారు. జాతీయ నులిపురుగుల వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానోపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఆదేశానుసారం విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంతరెడ్డి, మేరీబ్యూలా, గాయత్రి, రాజేశ్వరి, రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓల్డ్‌మలక్‌పేట: పిల్లల్లో నులిపురుగుల వ్యాధిని నివారించేందుకు విధిగా ఆల్‌బెండజోల్ మాత్రలు వేయాలని హైదరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ బ్రిజున్నీసా సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఓల్డ్‌మలక్‌పేటలోని వాహెద్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఆమె విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 1నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ మాత్రలు వేయాలని కోరారు. కార్యక్రమంలో మలక్‌పేట అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తరుణి, పీహెచ్ఎన్ రామేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చాదర్‌ఘాట్ : విద్యార్థుల్లో నులిపురుగుల వ్యాధి నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి విజ్ఞప్తి చేశారు. శాలివాహననగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు ఆమె ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. సోమవారం నుంచి 18వ తేదీ వరకు ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు తప్పనిసరిగా వేయించాలని శాలివాహననగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తరుణ్ తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఏడాది వయసున్న చిన్నారి నుంచి 19 సంవత్సరాల వయసున్న యువతీ యువకులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కనకవల్లి, ఆరోగ్య కేంద్రం సిబ్బంది విజయ్, స్వరూప, రాణి, రేణుక, రిబెకా, సంతోష్ పాల్గొన్నారు.

పార్కులు, కమ్యూనిటీ హాళ్లను అభివృద్ధి చేస్తా : సుధీర్‌రెడ్డి



కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని ప్రతీ కాలనీలో పిల్లల నుంచి పెద్దల వరకు పార్కులు, కమ్యూనిటీ హాళ్లను అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ శ్రీరామనగర్‌కాలనీలో రూ.60లక్షలతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాలు భవనాన్ని కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పుల ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిలు విచ్చేసి వేర్వేరుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీరామనగర్ కమ్యూనిటీ హాలు ప్రస్తుతం రెండంతస్తులో ఉందని, కాలనీ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు మరో అంతస్తు నిర్మిస్తామన్నారు. అదేవిధంగా కమ్యూనిటీ హాలు ప్రాంగణాన్ని మరో నాలుగు ఫీట్ల మేర ఎత్తు పెంచి షటిల్ గ్రౌండ్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు పార్టీలకతీతంగా అందరూ కలిసి రావాలని, ఒక పనికి రెండుమూడు సార్లు చేస్తూ ప్రజలను ఇబ్బందులు పెట్టొద్దని సూచించారు. ఇందుకు కాలనీ అసోసియేషన్లు కూడా సహకరించాలని కోరారు. స్వాతి రెసిడెన్సీ వద్ద పలు కారణాల వల్ల నిలిచిపోయిన ట్రంక్‌లైన్ పనులను త్వరలోనే ప్రారంభించుకుని డ్రైనేజీ సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, సీనియర్ నాయకులు టంగుటూరి నాగరాజు, పోచబోయిన జగదీష్‌యాదవ్, జక్కిడి రఘువీర్‌రెడ్డి, కాలనీ అసోసియేషన్ సభ్యులు జి.శ్రీనివాస్‌యాదవ్, ఎం.మోహన్‌రెడ్డి, గంజి సత్తయ్య పాల్గొన్నారు.



కుమారుడు శివచరణ్‌రెడ్డి వివాహానికి రావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, ప్రసన్న దంపతులు

సీఎంకు వివాహ ఆహ్వానం

మన్సూరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డికి వివాహం నిశ్చయమైంది. ఈ వివాహానికి రావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో సోమవారం కుమారుడు శివచరణ్‌రెడ్డితో కలిసి మర్యాదపూర్వకంగా కలిసిన టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, ప్రసన్న దంపతులు ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందజేశారు. కాగా ఈనెల 17వ తేదీ ఆదివారం శంషాబాద్‌లోని జీఎంఆర్ ఆరేనాలో దివ్యరెడ్డిని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి పరిణయమాడనున్నారు.

న్యాయం చేయాలి

అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పసుమాముల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 407లోని ప్లాట్ల బాధితులు సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. సర్వే నంబర్ 407, 408, 412లో 45 ఏళ్ల క్రితం చేసిన లేఔట్ వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు ప్లాట్లను కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొన్ని సంవత్సరాల తర్వాత సదరు భూ యజమానులు అధికారులతో కుమ్మకై అమ్మిన భూమికి తిరిగి పట్టదారు పాసుపుస్తకాలు పొందారని తెలిపారు. ఆ పాస్ బుక్‌లను బ్యాంక్‌లో తాకట్టుపెట్టి లోన్ తీసుకున్నారని సకాలంతో లోన్ చెల్లించకపోవడంతో 10 ఏళ్ల క్రితం బ్యాంక్ సదరు భూమిని స్వాధీనం చేసుకుందన్నారు. బ్యాంక్ స్వాధీనం చేసుకున్న భూమిలో తమ ప్లాట్లు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రూపాయి రూపాయి కూడబెట్టి కొన్ని ఏళ్ల క్రితం ప్లాట్లను కొనుగోలు చేశామని తెలిపారు. తాము కొనుగోలు చేసిన ప్లాట్లను తమకు తిరిగి వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గణేశ్ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా చౌకి రాజు

ఓల్డ్‌మలక్‌పేట : ఓల్డ్‌మలక్‌పేట గణేశ్ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా చౌకి రాజును ఎన్నుకున్నారు. సోమవారం ఓల్డ్‌మలక్‌పేట గణేశ్ లైబ్రరీలో జరిగిన సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చౌకి రాజు మాట్లాడుతూ ప్రజలు గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మండపాలు ఏర్పాటు మొదలుకొని నిమజ్జనం వరకు పోలీస్ వారికి సహకరించి అన్ని ఏర్పాట్లు చేస్తామని అన్నారు. అనంతరం రాజును సన్మానించారు. సమావేశంలో స్థానికులు చౌకి రవికుమార్, వేముల విజయ్‌కుమార్, బాబు శ్రీనివాస్, శ్రీకాంత్, రాజు, రేవంత్, రాజారావు పాల్గొన్నారు.

మలక్‌పేటలో రూ.5కోట్లతో సబ్‌స్టేషన్ ఏర్పాటు

చాదర్‌ఘాట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని ప్రభుత్వ క్వార్టర్స్ ఆవరణలోని ఖాళీ స్థలంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించినట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. సోమవారం మలక్‌పేటలోని ఆస్మాన్‌ఘడ్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడీఈలు శోభన్, పవన్, వినోద్‌రెడ్డితో ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మలక్‌పేటలో 33/11కేవీ సామర్థ్యం గల నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.5కోట్లు వ్యయమవుతుందన్నారు. ఇందుకు అవసరమైన స్థలాన్ని ఆర్‌అండ్‌బీ నుంచి సేకరించేందుకు అవసరమైన ఎన్‌వోసీ తీసుకోవాలని ఎమ్మెల్యే డీఈ విష్ణువర్ధన్‌రెడ్డికి సూచించారు.



సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే బలాల

కవర్ కండక్టర్లను ఏర్పాటు చేయాలి

విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తొలగించేందుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు అనుసంధానంగా కవర్ కండక్టర్‌లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బలాల విద్యుత్ అధికారులకు సూచించారు. 25కిలోమీటర్ల పొడవైన కవర్ కండక్టర్ ఏర్పాటుకు రూ.2కోట్ల వరకు వ్యయమవుతుందన్నారు. త్వరగా వీటిని ఏర్పాటు పూర్తిచేయాలని సూచించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు బాధితులకు అందజేత

సంతోష్‌నగర్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు ఊరట కల్పిస్తూ తప్పిపోయిన 21సెల్‌ఫోన్లను సంతోష్‌నగర్ పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కొన్ని రోజులుగా సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకున్న పోలీసులు వాటి అన్వేషణలో నిమగ్నమయ్యారు. సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అదనపు ఇన్‌స్పెక్టర్ జగన్‌రెడ్డితో పాటు సిబ్బందితో కలిసి సెల్‌ఫోన్లను సేకరించారు. సోమవారం సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ సుఖ్‌దేవ్‌సింగ్‌తో కలిసి బాధితులకు సెల్‌ఫోన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ సుఖ్‌దేవ్‌సింగ్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి సీఈఐఆర్ వెబ్‌సైట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. దొంగలించిన ఫోన్లతో నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో వినియోగదారులు వివరాలను నమోదు చేసుకుంటే సెల్‌ఫోన్‌లను ఈ పోర్టర్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు మణికంఠ, రవిగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



బాధితులకు సెల్‌ఫోన్‌లు అందజేస్తున్న సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ సుఖ్‌దేవ్‌సింగ్

లేబర్ ఇన్సూరెన్స్ కార్డు తీసుకోవాలి : వీరయ్య

ఎల్‌బీనగర్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులు లేబర్ ఇన్సూరెన్స్ కార్డు తీసుకోవాలని సీఐటీయూ సరూర్‌నగర్ సర్కిల్ కన్వీనర్ మల్లెపాక వీరయ్య సూచించారు. సరూర్‌నగర్‌లో సరూర్‌నగర్ భవన నిర్మాణ కార్మిక యూనియన్ లేబర్ అడ్డా సమావేశం గంజి పోలయ్య అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ ఇన్సూరెన్స్ తీసుకుంటే లేబర్ బోర్డు నుంచి సంక్షేమ పథకాలు కార్మికులకు వస్తాయన్నారు.

ముస్సిపాలిటీలో అస్తవ్యస్త శానిటేషన్

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ ముస్సిపాలిటీలో అస్తవ్యస్త శానిటేషన్ నిర్వహణపై ముస్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ స్థానిక నాయకుడు పిల్లి శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం శానిటేషన్ నిర్వహణపై ఆయన ముస్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా ముస్సిపాలిటీలో శానిటేషన్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందన్నారు. దీంతో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనం ఇస్తున్నాయని తెలిపారు. ఆయా కాలనీల్లో మురుగునీరు నిలిచిపోవడం, పారిశుధ్య నిర్వహణ లోపంతో దోమల బెడద విపరీతంగా పెరిగిందని పేర్కొన్నారు. దాంతో పట్టణ ప్రజలు డెంగీ, మలేరియా వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయంలో కమిషనర్ వెంటనే తగుచర్యలు తీసుకోవాలని కోరారు. మురుగు నిల్వల వద్ద బ్లీచింగ్, దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతన శశిధర్

చాదర్‌ఘాట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను అన్నివర్గాల సహకారంతో శాంతియుతంగా జరుపుకోవాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్ విజ్ఞప్తి చేశారు. సోమవారం భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఎల్బీనగర్ కన్వీనర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన గడ్డిఅన్నారం డివిజన్‌లోని గణేశ్ ఉత్సవాల నిర్వాహకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలన్నారు. సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి మాట్లాడుతూ ఉత్సవాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాంరెడ్డి, బ్రహ్మచారి, లక్ష్మీప్రసాద్, అశోక్, సాయి, మధు, కిరణ్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి

కొత్తపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎల్బీనగర్‌లోని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి అన్నారు. సోమవారం వనస్థలిపురం జడ్‌పీహైస్కూల్ నుండి 47మంది విద్యార్థులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ రోడ్డుసేఫ్టీ ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు పొందకుండా వాహనాలు నడపరాదని సూచించారు. పార్కులో ఏర్పాటు చేసిన నమూనా సిగ్నల్ వ్యవస్థను పిల్లలకు చూపించారు. లెక్చర్ హాల్‌లో యానిమేషన్ చిత్రాలు, రైమ్స్, వీడియో క్లిప్స్ ప్రదర్శించారు. హెల్మెట్ ప్రాధాన్యతను బ్యాటరీ కారులో సీటు బెల్టు ఉపయోగాన్ని, సైకిళ్లపై, స్కూటీపైనా వెళ్లే సమయంలో జాగ్రత్తలను టీటీఐ ఇన్‌స్పెక్టర్ ఎస్‌టీపీ అమరవర్ధన్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో హీరో మోటో కార్ప్ సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్, సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి

43 మంది మద్యంప్రియులకు కౌన్సిలింగ్

కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 43మంది మద్యంప్రియులకు 43మంది కుటుంబ సభ్యుల సమక్షంలో సీపీ క్యాంపు వద్ద ట్రాఫిక్ చిల్డ్రన్ పార్కు లెక్చర్ హాల్‌లో సోమవారం కౌన్సిలింగ్ నిర్వహించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో విద్యుత్ ఆర్టిజన్ మృతి

చాదర్‌ఘాట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్‌కు షార్ట్‌సర్క్యూట్ కావడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూసారాంబాగ్‌లో సోమవారం రాత్రి జరిగింది. మలక్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కిషన్‌బాగ్ నివాసి మహమ్మద్ అంజాద్‌ఖాన్(41) మూసారాంబాగ్ సలీంనగర్ సెక్షన్లో ఎఫ్ఓసీలో ఆర్టిజన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి మూసారాంబాగ్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో ఎఫ్ఓసి ఆర్టిజన్ మహమ్మద్ అంజాద్‌ఖాన్ అక్కడికి వెళ్లాడు. విద్యుత్ స్తంభం ఎక్కి విద్యుత్ సరఫరా పునరుద్ధరించే పనులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా జరగడంతో అంజాద్‌ఖాన్‌కు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. అంజాద్‌ఖాన్‌ను మలక్ పేట యశోద ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలతో పాటు పలువురు మలక్ పేట యశోద ఆస్పత్రికి చేరుకున్నారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసును మలక్‌పేట పోలీసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.